## క్లుప్తంగా

### భీమారంలో విమానం చక్కర్లు



లాల్‌బహదూర్‌పేటలో సంచరిస్తున్న విమానం

భీమారం: మండలంలోని లాల్‌బహదూర్ పేట గ్రామ పరిసరాల్లో సోమవారం విమానం భూమికి అతి దగ్గర నుంచి దాదాపు గంట సేపు సంచరించింది. ఉదయం వేళ గోదావ రిఖని వైపు నుంచి వచ్చిన విమానం మద్దికల్, ఎలకేశ్వరం, లాల్‌బహదూర్ పేట వరకు వచ్చి తిరిగి వెనక్కి మళ్లిందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సై బి. రాములుని అడగ్గా హైదరాబాద్ నుంచి భూముల సర్వే చేసేందుకు, ఆ విమానం వచ్చిందన్నారు.

### కాంగ్రెస్ సేవాదల్ ప్రచారం

దండేపల్లి: పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా దండేపల్లి మండలం వెల్గనూర్‌లో కాంగ్రెస్ సేవాదల్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. కాంగ్రెస్ సేవాదల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను గెలిచిన కొద్దిరోజుల్లోనే అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. మండల ఇన్‌చార్జి రాజమౌళి, నాయకులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన బోంపెల్లి సత్తయ్య–భూమక్క దంపతుల కూతురు త్రిశ, వివాహానికి స్థానికులు రూ.10వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. వీరితో పాటు, స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు 25కిలోల బియ్యం, రూ.వెయ్యి సరుకులు అందించారు.

జన్నారం: రోటిగూడకు చెందిన శక్తి కేంద్రం ఇన్‌చార్జి, బీజేపీ నాయకుడు చేపూరి గోపాల్‌కు రెండు కిడ్నీలు ఫెయిలై బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న బీజేపీ అధ్యక్షుడు గుండవరపు మధుసూధన్ రావు సోమవారం రూ.5000 ఆర్థిక సాయం అందజేశాడు.

### నేడు 'కైతల ఎన్నీల'

మంచిర్యాలఅర్బన్: 23న తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో గౌతమినగర్‌లో కైతల ఎన్నీల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశం, నాగవర్ధమ్ముత్యం తెలిపారు. సమ్మేళనానికి కవులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

### మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మడేలయ్య ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. ఇటిక్యాలకు చెందిన వేదపండితులు శ్రీ గొల్లపెల్లి శ్రీధరాచార్యులు, శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రజక సంఘం నాయకులు, కులస్తులు పాల్గొని మడేలయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.

### పాదయాత్రగా కొండగట్టుకు..

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన పలువురు హనుమాన్ దీక్ష స్వాములు పాదయాత్రగా సోమవారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. హనుమాన్ జయంతి రోజున దీక్ష విరమణ చేయనున్నట్లు స్వాములు తెలిపారు. వెళ్లే ముందు స్థానిక హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

### వరికోత తీరు పరిశీలన



డ్రైవర్‌కు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

దండేపల్లి: రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్న వరిధాన్యంలో కొన్ని చోట్ల తప్పా, తాలు వస్తుంది. దీనికి గల కారణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్. దండేపల్లి మండలం మాకులపేటలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాల సందర్శనకు వచ్చిన ఆయన మొకాశిగూడ సమీపంలో మాకులపేటకు చెందిన బత్తుల మహేష్ రైతు తన పొలంలో హార్వేస్టర్ యంత్రంతో వరిపొలాన్ని కోత కోయిస్తున్నాడు.. దీంతో అదనపు కలెక్టర్ తన వాహనాన్ని పక్కకు నిలిపి రైతు పొలం వద్దకు వెళ్లాడు. హార్వేస్టర్ యంత్రం పైకి ఎక్కి వరికోత తీరును పరిశీలించారు. కోత సమయంలో బ్లోయర్ స్పీడ్ 16 ఆర్‌పీఎం మాత్రమే ఉంది.. దీంతో బ్లోయర్ స్పీడ్‌ను 18 ఆర్‌పీఎంకు పెంచాలని, అలా అయితే వరిధాన్యంలో తప్పా, తాలు రాకుండా నాణ్యతగా ఉంటుందని హార్వేస్టర్ డ్రైవర్‌కు సూచించారు. బ్లోయర్ స్పీడ్ తక్కువ ఉండటంతోనే తప్పా, తాలు వస్తుందన్నారు. అనంతరం అల్లీపూర్ రామ్–లక్ష్మణ్ రైస్‌మిల్‌ను సందర్శించి, అన్‌లోడింగ్ ఆలస్యం కావొద్దని, వెంట వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీపీఎం వేణుగోపాల్ ఉన్నారు.

# నిశిరాత్రిలో నిఘా!

- రాత్రిపూట పోలీసుల గస్తీ ముమ్మరం
- జిల్లా కేంద్రంలో ఎస్సైతోపాటు మూడు టీంలతో పెట్రోలింగ్
- అనుమానాస్పదంగా తిరిగే వారి వివరాలు సేకరణ
- మద్యం, పాన్ దుకాణాలపై ప్రత్యేక దృష్టి
- వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచన



జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో పోకిరీల ఆగడాలు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌ల అలజడి, మందుబాబుల ఆగడాలకు కళ్లెం వేసేందుకు 'నిశి రాత్రిలో పోలీసుల నిఘా' ముమ్మరం చేశారు. రాత్రి 11గంటల నుంచి ఉదయం 4గంటల వరకు ఒక్క ఎస్సైతో పాటు మూడు పెట్రోలింగ్ బృందాలు, పెట్రోకార్ టీమ్‌లు రాత్రంతా గస్తీ తిరుగుతున్నాయి. ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రాత్రి మద్యం మత్తులో వీరంగం సృష్టించిన ఘటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం అయింది. నిశి రాత్రిలో నిఘా..! ఈ కార్యక్రమం ద్వారా రాత్రి సమయంలో సరదా కోసం రోడ్లపైకి వచ్చి జల్సాలకు పాల్పడుతున్న వారిని రైల్వేస్టేషన్, బస్టాండ్, వైన్స్‌లు ఉన్న ప్రాంతాల్లో, వీధుల్లో సైతం గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక పోలీస్ బృందాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి 11గంటలకే నైట్ పెట్రోలింగ్ టీమ్‌లు హల్‌చల్ సృష్టిస్తున్నారు. అనుమానాస్పదంగా ఎవరైన కనిపిస్తే, బార్లు, వైన్స్‌ల వద్ద గుంపులుగుంపులు కనిపించినా అదుపులోకి తీసుకొని విచారించి వదిలేస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వారిపై కేసులు నమోదు చేసి 41(ఎ) సీఆర్‌పీసీ కింద నోటీస్‌లిచ్చి వదిలేస్తున్నారు.

### సమయపాలన పాటించని వారిపై కొరడా...

జిల్లా కేంద్రంలో సమయపాలన పాటించని వ్యాపార సంస్థలపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ముఖ్యంగా మద్యం షాపులు రాత్రి 10గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లు రాత్రి 11గంటల వరకు నడుపాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా 12గంటల వరకు నిర్వహిస్తున్నారని, దీంతో మద్యం మత్తులో గొడవలు, దాడులు, అల్లర్లకు కారణమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో పాన్ టేలాలు, టీ స్టాల్స్, హోటల్స్ రాత్రి 12 గంటల వరకు ఉండడంతోనే పోకిరీలు ఒక్క చోటికి చేరుకొని మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. దీంతో పోలీసులు హోటల్స్, టీ స్టాల్స్, పాన్ షాప్‌లను రాత్రి 11 అయిందంటే కొరడా మూసివేయిస్తున్నారు. రోడ్డుపై ఏ కారణం లేకుండా గుంపులు గుంపులుగా కనిపిస్తే వారి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకుంటున్నారు.

### ఎస్సైతో పాటు మూడు బృందాలు...

పోకిరీల ఆగడాలకు కళ్లెం వేసేందుకు సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు రాత్రి సమయంలో ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో మొత్తం నాలుగు టీమ్‌లు గస్తీ తిరుగుతుంటారు. ఇందులో ఒక టీమ్‌లో ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారు. మరో మూడు టీమ్‌ల్లో ఒక్క టీమ్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోం గార్డ్ ఉంటారు. మూడు సెక్టార్లుగా విభజించి మూడు టీములను సమన్వయం చేస్తూ ఒక్క ఎస్సైతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు గస్తీ తిరుగుతుంటారు.

### చర్యలు తప్పవు



జిల్లా కేంద్రంలో పోకిరీల ఆగడాలను, రౌడీగ్యాంగ్ ముఠాలపై ప్రత్యేక నిఘా పెంచాం. ఈ నెల 13న ఐబీ చౌరస్తాలో మద్యం మత్తులో రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి కేసులో ఇరువర్గాలకు చెందిన 16మందిపై కేసు నమోదు చేశాం. అప్పటి నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. వ్యాపారస్తులు, టీ స్టాల్స్, హోటల్స్, పాన్ షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు. ఏమైన గొడవలు జరిగినా, ఎక్కువ మంది గుమ్మిగూడినా, రాత్రైనా, పగలైనా సరే 100కు సమాచారం అందించి పోలీసులకు సహకరించండి.

\- బన్సీలాల్, సీఐ, మంచిర్యాల

### ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సూపర్‌బజార్ ఏరియాలో గల షిరిడీ సాయిబాబా దేవాలయ 24వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథుడికి అభిషేకం, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మల్కేపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు



పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కేపల్లిలో సోమవారం దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఏదైనా నేరం జరిగిన క్రమంలో నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, మల్కేపల్లిలో కూడళ్ల వద్ద ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోగ్రాం రూంను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాల్సిందిగా కోరారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూమి పరిరక్షణతోనే మనుగడ



సర్వాయిపేట అడవిలో తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కోటపల్లి: పర్యావరణాన్ని కాపాడుతూ భూమిని పరిరక్షించుకోవడంపైనే భవిష్యత్తులో మానవాళితో పాటు సమస్త జీవరాశుల మనుగడ ఆధారపడి ఉందని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని సర్వాయిపేట సమీపంలోని అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నీలగిరి ప్లాంటేషన్, పరిసర అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాచర్ల సహాయంతో తొలగింపజేశారు. వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అటవీశాఖ వారికి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్లు సాయికిరణ్, లచ్చన్న, ఓదేలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సికలు మహిళా సాధికారతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్ 181, ఇతరత్ర టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధారాథోడ్

భీమారం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలలో మంజూరైన పనులు సత్వరమే చేపట్టాలని ఎంపీడీవో రాధా రాథోడ్ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ఆరెపల్లి పనులపై సోమవారం సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు కలిసి మహిళా సంఘాలతో చేపట్టాలని అన్నారు. జూన్‌లో తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని కోరారు. కాగా ఆరెపల్లి, ఎలకేశ్వరం పాఠశాలల్లో విద్యార్థులకు అందించే నీటివసతిని పరిశీలించారు. ఇందులో ఆర్‌డబ్లుఎస్‌ఏఈ విద్యాసాగర్, ఆర్‌అండ్‌బీ ఏఈ అనూషా పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని ఊరు రామకృష్ణపూర్ ఏరియాలో సోమవారం లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బొంతు రమేష్–శారద, తూటి సతీష్–మమత దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మహా గణపతి, వీర హనుమాన్, నాగసుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహధ్వజ స్తంభ కనుకదుర్గాదేవి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సముద్రాల సంతోష్‌చారి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కార్మికవర్గ భవిష్యత్‌కు బాటలేసిన ఉద్యమకారుడు లెనిన్



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సోషలిజం, మార్క్సిజం, లెనినిజం అనే ఆయుధాలతో ప్రపంచ కార్మిక వర్గానికి భవిష్యత్ బాటలు వేసిన కార్మికోద్యమనేత వ్లాడిమిర్ లెనిన్ అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోషలిస్టు ఉద్యమకారుడు కామ్రేడ్ వ్లాడిమిర్ లెనిన్ జయంతిని సోమవారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, ఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాములు, సదయ్య, దేవయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని విశ్వనాథ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దొంతుల ముఖేష్, నక్షత్ర ఇంజనీరింగ్ అధినేత చాకినారపు అనిల్‌లు బీఆర్‌ఎస్ పార్టీని వీడి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను ఎమ్మెల్యేతో పాటు, పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు వేసి పార్టీలోకి చేర్చుకున్నారు.

### అంబలి కేంద్రం ప్రారంభం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో నక్షత్ర ఇంజనీరింగ్ అధినేత చాకినారపు అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్ రామగిరి బానేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, నాయకులు పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీల్లో డీపీవో పర్యటన



డ్రైయినేజీ పనులు పరిశీలిస్తున్న డీపీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, బావురావుపేట గ్రామ పంచాయతీలను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి మొక్కల పెరుగుదలకు అవసరమయ్యే వర్మీ కంపోస్టును వాడాలని, నర్సరీలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేయించాలని, గ్రామాల్లో ప్లాస్టిక్, చెత్తా ఎక్కడా కనబడకుండా చూసుకోవాలని తెలిపారు. కిష్టంపేట పంచాయతీలోని ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ మరమ్మతులు, తాగునీటి సరఫరా చేసే ఓహెచ్‌ఎస్‌ఆర్ మిషన్ భగీరథ, బోర్‌వెల్ మోటార్లను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందునా, ఎక్కడా సమస్య లేకుండా చూడాలన్నారు. ఈయన వెంట ఎంపీవో అజ్మత్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు దివ్య, దివాకర్ ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఒత్తిడితో అనారోగ్య పాలవుతున్నారు. పనిఒత్తిడి, అవిశ్రాంతితో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగుల అనారోగ్య పరిస్థితులను గమనించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్–2లో భాగంగా డిపోల వారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ నెల 18 నుంచి కార్మికులకు మధుమేహం, రక్తపోటు, ఈఎన్‌టీ, కిడ్నీ లివర్, గుండె తదితర 17రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 380మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

## 'అక్రమార్కులపై చర్యలు తీసుకోండి'

తాండూర్: రేషన్ బియ్యం అక్రమ మార్గాన పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆకలితో అలమటించవద్దని కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ బియ్యం అందజేస్తుంటే, కొందరు రేషన్ బియ్యం అక్రమ దందాకు తెర తీయడం దారుణం అన్నారు. క్వింటాళ్ల కొద్ది బియ్యం అక్రమ మార్గాన మహారాష్ట్రకు తరలిపోతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరు గారి పోతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## స్పందించారు.. పరిష్కరించారు..!



చెట్టు కొమ్మ తొలగిస్తున్న జేసీబీ

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం మండలం కుందారం ఎక్స్‌రోడ్డు సమీపంలో సోమవారం మధ్యాహ్నం చెట్టు కొమ్మ పడిపోయింది. దీంతో రెండు వైపులా వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని పలువురు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రాముల వెంటనే స్పందించి జేసీబీని పంపించి పోలీసుల సాయంతో రోడ్డుపై పడిపోయిన చెట్టు కొమ్మను తొలగించి రాకపోకలను క్లియర్ చేశారు.

### ఇంటింటా బీజేపీ ప్రచారం



తాండూర్: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కాసిపేట/తాండూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూర్ మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయతీలో, కాసిపేట మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి గ్రామాల్లో సోమవారం ఆయా మండలాల బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ కమలం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో కాసిపేటలో మండలాధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, ముత్యంపల్లి శక్తి కేంద్ర ఇన్‌చార్జి బాకీ కిరణ్, బూత్ అధ్యక్షులు హరీష్, కిషోర్, దగడు సాయి, అనిల్, అభిరామ్, తాండూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మండల కార్యదర్శి సిద్దం మల్లేష్, నాయకులు తుకారాం, చంద్రయ్య, ప్రదీప్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



పద్దనపల్లిలో యాగశాల పూజల్లో వేదపండితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రస్థాన, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, యోగిని, వాస్తు, క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాతా మూర్తుల విగ్రహాలను స్థానిక గోదావరిలో శుద్ధి చేసి శోభాయాత్రగా ఆలయం వరకు తీసుకొచ్చి జలాధివాసం జరిపారు. కాగా మంగళవారం సామూహిక హనుమత్ హోమం, 108 కళశ సుగంధ ద్రవ్య అభిషేకం, ధాన్యావాసం, పుష్ప, ఫల శయాది వాసములు తదితర పూజా కార్యక్రమాలు, బుధవారం మూడో రోజు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, భక్తులకు దర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు అన్నప్రసాద వితరణ ఉంటుందని ఈ సందర్భంగా భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.